క్లుప్తంగా

5వ సెమిస్టర్ ఫలితాలు

దొనకొండ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 5వ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక గౌతమీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. వారిలో బీకాం కంప్యూటర్స్ విభాగం నుంచి పోటు పాలంక వీరయ్య 552/700, మోడి పూజిత 550/700, ఉప్పేల పెద్దక్క 537/700 సాధించారు. బీఏ విభాగంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ఎం.బాలకాశయ్య 482/600, వి.ప్రవల్లిక 467/600, టి.ప్రియాంక 459/600 సాధించారని కళాశాల అడ్మిన్ నాని తెలిపారు. ఈ సందర్భంగా వారిని కళాశాల చైర్మన్ కె.గుండారెడ్డి, ప్రిన్సిపాల్ గోపి, వైస్ ప్రిన్సిపాల్ రామయోగి, సిబ్బంది అభినందించారు.

పోస్టాఫీసులో నిలిచిన ఆన్‌లైన్ సేవలు

దొనకొండ: స్థానిక పోస్టాఫీసులో ఐదు రోజుల నుంచి బీఎస్ఎన్ఎల్ ఇంటర్‌నెట్ ఆన్‌లైన్ సేవలు ఆగిపోయాయి. వివిధ పనుల కోసం గ్రామాల నుంచి పోస్టాఫీసుకు వచ్చిన వినియోగదారులకు కంప్యూటర్‌లు పని చేయక పోవటంతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. పోస్టాఫీసులో పోస్టల్, పార్శిల్ బుకింగ్, రిజిస్టర్ పోస్ట్, ఆర్‌డీ చెల్లింపులు, ఆధార్, ఇన్సూరెన్స్ తదితర సేవలు వినియోగదారులకు అందిస్తుంటారు. 5 రోజుల నుంచి ఆ సేవలకు సెలవు. బీఎస్ఎన్ఎల్ అధికారులు పట్టించుకోక పోవడంతో పోస్టల్ ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. పోస్టల్ వారిపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి ఆన్‌లైన్ సేవలు వెంటనే జరిగేలా చర్యలు చేపట్టాలని గ్రామాల్లోని ఖాతాదారులు కోరుతున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌తో కేసుల పరిష్కారం

- సీనియర్ సివిల్ జడ్జి శివశంకరరెడ్డి

దర్శి: కేసుల పరిష్కారానికి రాజీనే రాజమార్గమని దర్శి సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.శివశంకరరెడ్డి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంపై ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కేసుల రాజీ కోసం ఈ నెల 29వ తేదీన లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సివిల్, క్రిమినల్ కేసులతో పాటు ఎలాంటి కేసులు అయినా పరిష్కరించుకోవచ్చన్నారు. అందు కోసం కక్షిదారులతో మాట్లాడి వారిని లోక్‌అదాలత్ పట్ల చైతన్య పరచాలన్నారు. సీనియర్ సివిల్ కోర్టు పరిధిలోని ఎలాంటి పెండింగ్ కేసులనైనా పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.

హిందూ ధర్మంపై ఆసక్తి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మంపై ఆసక్తి కలిగి ఉండాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గిద్దలూరు ఖండ కార్యవాహ్ పంటా శివ మల్లారెడ్డి అన్నారు. హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సాహితి కళాశాలలో బుధవారం విద్యార్థులకు నిర్వహించి అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందువుగా ఉన్న ప్రతి ఒక్కరూ గర్వంగా జీవించాలన్నారు. హిందూ ధర్మం జాగరణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మన ధర్మాన్ని రక్షించుకుంటూ ఎదుటి వారికి సేవ చేయాలనే ఆలోచనలో ప్రతి ఒక్కరం జీవితాన్ని గడపాలన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘ సేవకులు బీఎస్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



వద్దిమడుగులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

కొనకనమిట్ల: గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టించి గొడవలకు కారణమైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మాధవరావు హెచ్చరించారు. బుధవారం మండలంలోని వద్దిమడుగు, వాగుమడుగు గ్రామాల్లో పర్యటించి శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా సమన్వయం పాటించి ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. ఒకరికొకరు కలిసిమెలిసి ఉండాలని సూచించారు. అనంతరం కొనకనమిట్ల వద్ద జాతీయ రహదారిపై పలు వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని వాహనదారులను హెచ్చరించారు.



గిరిజనులకు రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు అధికారి



సదస్సుకు హాజరైన చెంచు గిరిజనులు



పుల్లలచెరువులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రక్తహీనతపై తగిన జాగ్రత్తలు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ షరీఫ్



వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్



కంభంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- రక్తహీనతపై గిరిజనులు అప్రమత్తంగా ఉండాలి

పెద్దదోర్నాల: రక్తరక్తహీనత వ్యాధిపై చెంచు గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలలో సికిల్ సెల్ ఎనీమియా (రక్తహీనత) వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనులను ఉద్దేశించి మాట్లాడుతూ రక్తహీనత అంటువ్యాధి కాదని, జన్యు పరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే సంభవిస్తుందన్నారు. ఇది ఎక్కువగా గిరిజన తెగల్లో కనబడుతుందన్నారు. రక్తహీనత వ్యాధిని సకాలంతో గుర్తించి తగిన వైద్య సదుపాయం పొందాలన్నారు. ఈ వ్యాధిని గుర్తించాలంటే రక్త కణాల సంఖ్య తగ్గటం, కళ్లు పసుపు రంగులోకి మారటం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు పడటం తదితర లక్షణాలతో ఈ వ్యాధిని గుర్తించవచ్చని సూచించారు. ఎక్కువ శాతం పోషక విలువలు కలిగన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం చెంచు గిరిజనులకు రక్త నమూనాలు సేకరించి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓలు శ్రీనివాసరావు, పద్మావతి, ప్రభుత్వ వైద్యులు ప్రశాంతి, యాగ్నిక్, వెంకటేశ్వర్లు, చింతల సర్పంచ్ వెంకటయ్య పాల్గొన్నారు.

పుల్లలచెరువు: విద్యార్థులు రక్తహీనతపై అశ్రద్ధ చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ లక్ష్మీనరసింహస్వామి అన్నారు. ప్రపంచ రక్తహీనతా నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది, వెలుగు శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా చదువుకునే విద్యార్థుల్లో రక్తహీనత ఎక్కువగా వస్తుందని, దాని నివారణకు సరైన పద్ధతులు పాటిస్తే నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఏపీఎం వెంకటయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనతను అవగాహనతో నివారించవచ్చు

గిద్దలూరు రూరల్: రక్తహీనతను అవగాహనతో నివారించవచ్చని అర్బన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షరీఫ్ అన్నారు. సికిల్ సెల్ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక అర్బన్ కాలనీలోని సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సికిల్ సెల్ అనీమియా (కొడవలికణ రక్తహీనత)ను నివారించాలంటే అవగాహనతోనే సాధ్యమవుతుందని డాక్టర్ షరీఫ్ అన్నారు. గిరిజన ప్రాంతంలో ఈ వ్యాధి ఎక్కువగా ఉండటంతో ప్రధానమంత్రి, జనజాతి ఆదివాసి న్యాయమహా అభియాన్ మిషన్ ప్రకారం 2047 సంవత్సరం నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి కృషి వల్ల వ్యాధిని నివారించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ వ్యాధి జన్యు మార్పిడి లోపం ద్వారా వ్యాధి అనేది వారసత్వంగా వచ్చిన ఎర్రరక్త కణాల రుగ్మతల సమూహం, ఇక్కడ మన రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా ఉంటాయన్నారు. అవగాహన కల్పించడం వల్ల వ్యాధిని అరికట్టవచ్చన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు సుధారాణి, ఖాశింబీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కంభం: సికెల్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం వైద్యసిబ్బంది కంభం, కందులాపురం సచివాలయాల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అనంతరం గురుకుల పాఠశాలలో విద్యార్థులకు వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు. సికెల్ సెల్ వ్యాధిని కొడవలి కణ రక్తహీనత అంటారని, కొంతమందిలో జన్యు సంబంధ మార్పులతో ఎర్రరక్త కణాలు కొడవలి ఆకారంలోకి మార్పు చెందుతాయని తెలిపారు. సాధారణ రక్తకణాల జీవితకాలం 120 రోజులైతే సికిల్‌సెల్ సోకిన వారి రక్త కణాల జీవితకాలం 25 రోజులుగా ఉంటుందన్నారు. ఈ వ్యాధి సోకిన వారి సికిల్ సెల్ రక్తకణాలు వంపు తిరిగి ఉండటంతో రక్తనాళాల్లో సరిగ్గా ప్రవేశించలేక శరీర భాగాలకు ఆక్సిజన్ అందడం తగ్గిపోతుందని, వెంటనే చికిత్స పొందక పోతే మారే అవకాశం ఉందన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరి, సీహెచ్ఓలు సర్దార్, సుహాసిని, ప్రవల్లిక, మలేరియా యూనిట్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దారవీడు: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ జి.రవి అన్నారు. పెద్దారవీడు పాత పంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా లక్షణాలు ఉన్న వారు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని సకాలంలో చికిత్స తీసుకోవాలన్నారు. వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్త కణాలు రుగ్మతల సముహం వ్యాధి సోకిన వ్యక్తి రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా ఉంటాయన్నారు. రక్త కణాల సంఖ్య తగ్గడంతో రక్తహీనత వస్తుందని, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, శరీరంలో ఏదైనా అవయవం దెబ్బతినడం, వీపు, కాళ్లు, ఛాతీ మొదలైన వాటిలో తీవ్రమైన నొప్పిని కలిగి ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు సూచించారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి 2040 నాటికి నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో 40 ఏళ్ల మధ్య ఉన్న ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ హరినాథ్, హెల్త్ సూపర్‌వైజర్ సుభాని, వెలుగు ప్రాజెక్టు సీసీ శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముండ్లమూరు: సికిల్ సెల్ ఎనీమియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మారెళ్ల వైద్యాధికారి సీహెచ్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గ్రామస్తులకు ఆ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా తరచూ ఏదో ఒక వ్యాధికి గురైనపుడు రక్తహీనతతో బాధపడుతూ తరుచూ తీవ్ర నొప్పులకు గురైతే వెంటనే వ్యాధి నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఇది అంటు వ్యాధి కాదని, ఎవరూ భయపడాల్సిన పని లేదన్నారు. గాలి, నీరు, చర్మం ద్వారా ఈ వ్యాధి ఇతరులకు సోకదన్నారు. జన్యుపరంగా వారి తల్లిదండ్రుల నుంచి మాత్రమే ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. వాతావరణంలో మార్పు విరేచనాలు, జ్వరం, నిర్జలీకరణ, ఇన్‌ఫెక్షన్, ఒత్తిడి, అలసట మొదలైనవి నొప్పి సంక్షోభాన్ని ప్రేరేపిస్తాయన్నారు. ఎవరూ ఈ వ్యాధి గురించి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. పరీక్ష చేపించుకోవడం ద్వారానే ఈ వ్యాధిని గుర్తిస్తారన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పూరిమెట్ల, ఉమామహేశ్వరపురం, ఈదర, నాయుడుపాలెం, శంకరాపురం, జమ్ములమడక, పోలవరం గ్రామాలకు చెందిన ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరావు, హెచ్ఈ కేపీ రాజు, సిబ్బంది అంజమ్మ, ఎస్‌కెఎంఎం సుభానీ, రత్నకుమారి, జయశ్రీ, శరణ్య, కోడూరి శశి, లక్ష్మి, కిరణ్ పాల్గొన్నారు.



పెద్దారవీడులో మాట్లాడుతున్న డాక్టర్ రవి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన

మార్కాపురం రూరల్: ప్రపంచ సికిల్‌సెల్ అనీమియా దినం సందర్భంగా బుధవారం మార్కాపురం మండలంలోని గజ్జలకొండ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న 11 సచివాలయాల్లో డాక్టర్లు జి.కిశోర్‌రెడ్డి, సాయిచరణ్‌తేజ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, వైద్య పరీక్షలు నిర్వహించారు. రాయవరంలోని కొమురం భీమ్ కాలనీలో 79 మందికి పరీక్షలు చేశారు. రక్త పరీక్షల్లో ఎవరికీ సికిల్ సెల్ అనీమియా పాజిటివ్ రాలేదని చెప్పారు. జన్యు సంబంధమైన ఈ వ్యాధిపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోటయ్య, కార్యదర్శి సుధాకర్, ఎంపీహెచ్ఈఓ శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్లు పెద్దయ్య, కాశయ్య, లక్ష్మయ్య, ఆశా కార్యకర్తలు ఆదిలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపు ఆపాలి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మార్కాపురం: గత 25 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను తొలగించేందుకు రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఆ ఆలోచన వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం నాయకులతో కలిసి బుధవారం ఎంఈఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. ప్రభుత్వం మారగానే కొందరు వ్యక్తులు వచ్చి రాజీనామా చేయాలని లేదా మానుకోవాలని బెదిరించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో భోజన పథకాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తూ విద్యార్థులకు సకాలంలో భోజనం పెడుతున్నారని, ప్రస్తుతం పనిచేస్తున్నవారినే కొనసాగించాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు టి.గురునాధం, కొండమ్మ, మరియమ్మ, నాగిరెడ్డి, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి గురుపౌర్ణమి ఉత్సవాలు

మార్కాపురం టౌన్: జూలై 21న గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న బాబా మందిరంలో ఈ నెల 27 నుంచి జూలై 22వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యదర్శి గోపాలుని హరిహరరావు బుధవారం తెలిపారు. గురుపౌర్ణమి సందర్భంగా ఓంసాయి.. శ్రీ సాయి.. జయ జయ సాయి.. నామ ఏకాహం, 28న మధ్యాహ్నం 3 గంటలకు బాబా జీవిత చరిత్రపై క్విజ్ కార్యక్రమం, 29న భక్తి గీతాల పాటల పోటీలు, 30వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు మార్కాపురం పట్టణంలో సాయి భిక్షాటన, జూలై 4న సాయిబాబా సర్వాంతర్యామి అనే అంశంపై ప్రవచనం, 5న సాయి సత్‌చరిత్ర, 6న సాయిబాబాలోని సుగుణ సంపద అంశంపై ప్రవచనాలు, 7న సాయి సచ్చరిత్రలోని కర్మసిద్ధాంతం, 8న సాయి సత్‌చరిత్ర 32వ అధ్యాయం, 9న సాయిబాబా చూపిన జ్ఞాన మార్గం, 10న సత్‌చరిత్రపై ప్రవచనాలు ఉంటాయని వివరించారు. జూలై 11 నుంచి 18వ తేదీ వరకు బాబా జీవిత చరిత్ర పారాయణం, జూలై 18వ తేదీ రాత్రి 7 గంటలకు సినీ భక్తి గీతాల పాటకచేరి, జూలై 19న శ్రీ లలిత సహస్ర నామ పారాయణం, రాత్రి ఏడు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 20న సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, గురు పౌర్ణమి రోజున ఉదయం 5.10 నిముషాలకు కాకడ హారతి, 6 గంటలకు పంచామృతాభిషేకం, 8 గంటలకు శ్రీశైలానికి చెందిన సాయిదాసు ఆధ్వర్యంలో సాయి సత్య వ్రతాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. జూలై 22న ఉదయం 8 గంటలకు పుర వీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

విద్యా వ్యవస్థలో సమస్యలు పరిష్కరించాలి



హెచ్ఎంతో మాట్లాడుతున్న ఎంపీజే సభ్యులు

మార్కాపురం టౌన్: విద్యావ్యవస్థలో ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ కోరారు. ఎంపీజే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా జాగృతి ఉద్యమంలో భాగంగా బుధవారం స్థానిక జెడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలలో సంస్థ ప్రతినిధులు పర్యటించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యావ్యవస్థ గందరగోళంలో ఉందన్నారు. మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని, అదనపు తరగతి గదుల నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, విద్యార్థులకు స్కూల్ కిట్స్ అందించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రసూల్, జహీర్, నాగూర్‌మీరావలి, ఖాశింసా, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు సీజ్ చేస్తాం

మార్కాపురం: మార్కాపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ పరిధిలో ఉన్న స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ లేకుంటే సీజ్ చేస్తామని ఎంవీఐ మాధవరావు హెచ్చరించారు. బుధవారం ఆయన పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన పది బస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్సులకు లైసెన్సు, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్ తదితర రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. స్కూల్ బస్‌ల మెయింటెన్స్ సక్రమంగా ఉండాలని, రోజూ బస్సుల బ్రేక్‌ను డ్రైవర్లు చెక్ చేసుకోవాలని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా యాక్సిడెంట్లు జరిగి పిల్లల జీవితాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, విద్యార్థులను పాఠశాల నుంచి ఇంటికి, ఇంటి నుంచి పాఠశాలకు తీసుకెళ్లే సమయంలో ముందు వెళ్తున్న వాహనాలను ఓవర్‌టేక్ చేయవద్దని చెప్పారు. బస్సుల నుంచి విద్యార్థులను కిందకు దించేటప్పుడు, ఎక్కించేటప్పుడు క్లీనర్లు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



బస్సు రికార్డులు పరిశీలిస్తున్న ఎంవీఐ మాధవరావు

ఎమ్మెల్యే కోసం విద్యార్థుల ఎదురుచూపులు

గిద్దలూరు రూరల్: స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఎప్పుడు తమ పాఠశాలకు వచ్చి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తారని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో పాఠశాలలు ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభించారు. దాదాపు అన్ని చోట్లా పుస్తకాల పంపిణీ దాదాపు పూర్తి చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఒక్క గిద్దలూరు మండలం తప్ప 5 మండలాల్లో పంపిణీ చేశారు. జూన్ 1వ తేదీ పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌పుస్తకాలు వచ్చాయి. మండల విద్యాశాఖ అధికారుల అత్యుత్సాహం ఎమ్మెల్యే వద్ద తమ ప్రాబల్యం పెంపొందించుకోవాలనే ఉద్దేశంతో పాఠ్యపుస్తకాలను ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేయించాలని పుస్తకాల పంపిణీ చేయించకుండా అలాగే నిలిపివేశారు. దీంతో పాఠ్యపుస్తకాలు అందక విద్యార్థులు ఎమ్మెల్యే ఎప్పుడు వస్తాడా.. ఎప్పుడు తమ చేతికి పుస్తకాలు అందుతాయా అని ఎదురు చూస్తున్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు



రోడ్డు మధ్యలో ఏర్పడిన లోతైన గుంత

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట డ్రైనేజీ నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఒంగోలు-నంద్యాల హైవే రోడ్డు వరకు నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. ఎంపీడీఓ కార్యాలయం ముందు భాగంలో డ్రైనేజీ కాలువ నిర్మాణం కోసం కొంతమేర రోడ్డు నిర్మించకుండా వదిలిపెట్టారు. ఇక్కడ నీరు రోడ్డుపైకి పారుతుండటంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు మధ్యలో లోతైన గుంత ఉండటంతో పాటు మురికినీరు ప్రవహిస్తోంది. అధికారులు చర్యలు తీసుకుని చిన్నపాటి చప్టా నిర్మాణం చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com